ఘనంగా దుర్గాష్టమి వేడుకలు


కఠెవరంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కనకదుర్గమ్మ


మారీసుపేట శివాలయంలో మహిషాసురమర్ధిని


వాసవీ ఆలయంలో రాజరాజేశ్వరిదేవికి దుర్గాదేవి అలంకరణ

తెనాలిటౌన్: పట్టణ, రూరల్ గ్రామాల్లోని ఆలయాల్లో దసరాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా జరుపుతున్నారు. ఆదివారం దుర్గాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరిపారు. దేవిచౌక్‌లోని రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు భక్తులకు మహాకాళి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం బాల అమ్మవారు పూజ, మధ్యాహ్నం శ్రీ చక్ర అర్చన, తీర్థ ప్రసాద వితరణ చేశారు.

■ బోసు రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆలయ కమిటీ సభ్యులు మద్దాళి శేషాచలం దంపతులు చండీ హోమం జరిపారు. పూర్ణాహుతిలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజలు జరిపారు. ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ ఆలయం, మారీసుపేట శివాలయంలో అమ్మవారు మహిషాసురమర్ధనీదేవిగా అలంకరణ చేశారు.

■ గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో పూజ్యశ్రీ బాలస్వామిజీ పర్యవేక్షణలో జరుగుతున్న ఉత్సవాల్లో అమ్మవారిని రుద్రాక్షలతో మహిషాసుర మర్ధనీదేవిగా అలంకరణ చేశారు. సాలిగ్రామ మఠం సభ్యులు ఎం.రమణయ్య, వుప్పల నాగేశ్వర రావు, లలిత సేవా సమితి, శ్రీ విద్యాపీఠం సభ్యులు పాల్గొన్నారు.

■ రూరల్ మండలం నంది వెలుగులోని కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరణ చేశారు. ఈవో తమ్మా శివారెడ్డి పర్యవేక్షించారు.


శ్రీ విద్యాపీఠంలో రుద్రాక్షలతో మహిషాసురమర్ధిని


దేవిచౌక్‌లోని రాజరాజేశ్వరి ఆలయంలో మహంకాళీదేవి అలంకరణ

అలరిస్తున్న వీణా అవార్డ్స్ నాటక పోటీలు

తెనాలి: కళల కాణాచి–తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్–విజయవాడ సంయుక్త నిర్వహణలో తెనాలిలో నిర్వహిస్తున్న తృతీయ జాతీయ పద్య నాటక/సాంఘిక నాటికల పోటీలు వీణా అవార్డ్స్–2023 మూడో రోజు ఆదివారం కొనసాగాయి. శ్రీ టీబీఆర్ ఆర్ట్స్ థియేటర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ వారి 'శ్రీస్వామి అయ్యప్ప' పద్య నాటకాన్ని ప్రదర్శించారు. వల్లేటి లక్ష్మీ కులశేఖర్ రచించిన ఈ నాటకానికి టి.ఇందిరాదేవి దర్శకత్వం వహించారు. ధర్మశాస్త్ర/అయ్యప్పగా చిరంజీవి పి.హృషీకేశ్, శివుడు/రాజశేఖర పాండ్యుడుగా టి.బాబురాజు, విష్ణుమూర్తిగా బి.తులసీకృష్ణ, బ్రహ్మగా టి.వెంకటేష్, మోహిని, మహారాణిగ వెంగమాంబ సురభి నటించారు. సంగీతం డాక్టర్ ఎస్.చంద్రబాబునాయుడు సమకూర్చారు. సెట్స్ అండ్ లైటింగ్ సురభి సంతోష్ అందించారు. అనంతరం శ్రీకుమార భీమేశ్వర నాట్యమండలి, కాకినాడ వారి 'నర్తనశాల' నాటకం ప్రదర్శించారు. కాళ్లూరి రామారావు రచనకు ఎస్కే అమీర్ దర్శకత్వం వహించారు. సాయంత్రం అభినయ ఆర్ట్స్–గుంటూరువారి సాంఘిక నాటకం 'ఇంద్రప్రస్థం'ను ప్రత్యేకంగా ప్రదర్శించారు. స్నిగ్ధ రచనకు ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. రాత్రి 7 గంటలకు సిరి మువ్వ కల్చరల్స్–హైదరాబాద్ వారి 'మాట్లాడుకుందాం' సాంఘిక నాటికను ప్రదర్శించారు. మాడభూషి దివాకరబాబు రచనకు మంజునాథ్ దర్శకత్వం వహించారు. కళల కాణాచి గౌరవ సలహాదారు గోగినేని కేశవరావు, వ్యవస్థాపక కార్యదర్శి షేక్ జానీబాషా, కోశాధికారి దేవరపల్లి భవాని, సహాయ కార్యదర్శులు గోపరాజు విజయ్, కొండముది రమేష్ పర్యవేక్షించారు.


నర్తనశాల పద్యనాటకంలో సన్నివేశం

జూదరుల అరెస్ట్

కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామ శివారులో ఏడుగురు పేకాట ఆడుతుండగా సమాచారం అందడంతో ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి ఆదివారం తన సిబ్బందితో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.45,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి–విజయవాడ రైలు మార్గంలోని కొలనుకొండ, కృష్ణా కెనాల్ స్టేషన్ల మధ్య పట్టాల వెంబడి మృత దేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. మృతుడు రైలు నుంచి జారిపడి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మందగించిన పన్నుల వసూలు

- కోర్టు వివాదాలతో ఆటంకాలు
- నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న అధికారులు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో పన్నుల వసూలు కొంత మందకొడిగా సాగుతోంది. కోర్టు వివాదాలు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల అధికారులు పన్నుల చెల్లింపులో చేస్తున్న జాప్యం వల్ల ఆశించిన స్థాయిలో పన్నుల వసూలు జరగటం లేదు. మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్న ఫలితాలు పెద్దగా కనిపించటం లేదు. దీంతో తెనాలి మునిసిపాలిటీ నిధుల లేమితో ఇబ్బందులుపడాల్సివస్తోంది.

తెనాలి పురపాలక సంఘానికి ఇంటి, కుళాయి, కాళీ స్థల పన్నులు, షాపుల అద్దెలు ప్రధాన ఆదాయ వనరులు. వీటిని అధికారులు ప్రతి ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు, అక్టోబర్ నుంచి మార్చి వరకు రెండు విడతలుగా వసూలు చేస్తుంటారు. తెనాలి పట్టణంలో సుమారు 35,992 నివాస గృహాలు, 234 మున్సిపల్ షాపులు ఉన్నాయి. వీటి ద్వారా ఏడాదికి రూ.17,58,41,501 ఆదాయంసమకూరుతోంది.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న పట్టణ వాసులు...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది ప్రారంభంలో పన్ను చెల్లింపుదారులకు అనేక రాయితీలు ప్రకటించింది. ఏప్రిల్‌లో ఏడాదికి చెల్లించాల్సిన ఇంటి పన్ను ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీని ప్రకటించింది. దీంతో ఎక్కువ మంది యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో తెనాలి పట్టణంలోని 16, 148 ఇళ్ల యజమానులు ఇంటి పన్ను రూపంలో రూ.6,31,59,273 చెల్లించారు. వీరందరికి ప్రభుత్వం ఇచ్చిన రాయితీ లభించింది.


మున్సిపల్ కార్యాలయంలో పన్ను చెల్లిస్తున్న పట్టణవాసి

వసూలులో జాప్యం

తెనాలి పట్టణంలో ఇప్పటి వరకు రూ.9,22,54,115లు పన్నులు రూపంలో వసూలయ్యాయి. అంటే మొండి బకాయిలు కాకుండా సుమారు 75 శాతం పన్నులు వసూలు జరిగిందని అధికారులు చెబుతున్నారు. మిగిలిన రూ.8,35,87,386ల పన్నులు వసూలు కావాల్సి ఉంది. సుమారు అయిదు నెలల్లో ఇది వసూలు చేయాల్సి ఉంది.

కోర్టు కేసులతో ఇబ్బందులు

పట్టణంలోని అనేక భవనాలు, స్థలాలు కోర్టు వివాదాలలో ఉన్నాయి. దీంతో పన్నుల వసూలులో జాప్యం జరుగుతోంది. అలాగే కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కార్యాలయాల పన్నుల చెల్లింపు దాదాపు పూర్తిగా నిలిచి పోయిందని అధికారులు చెబుతున్నారు. ఎన్నిసార్లు ఆయా కార్యాలయ అధికారులకు నోటీసులు ఇచ్చిన ప్రయోజనం ఉండటం లేదని సమాచారం.

సకాలంలో పన్నులు చెల్లించాలి



ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలి. అలా చెల్లించటం వల్ల అపరాధ రుసుం కట్టనవసరం లేదు. పన్నుల వసూలు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దానిని వేగవంతం చేశారు. అలాగే వార్డు సచివాలయ సిబ్బందికి ప్రతి రోజు టార్గెట్ ఇచ్చి వసూలు చేయిస్తున్నాం. మార్చి చివరి లోపు నూరు శాతం పన్ను వసూలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– సోమశేఖర్ యాదవ్, రెవెన్యూ అధికారి, తెనాలి పురపాలక సంఘం

తెనాలి పరిశోధక విద్యార్థికి ఇజ్రాయెల్‌లో అరుదైన ప్రాజెక్ట్

- ఎనర్జీ స్టోరేజి అండ్ కన్వర్షన్‌లో పరిశోధనకు అవకాశం
- అంతలోనే యుద్ధ పరిణామాలతో ఆందోళన
- నేడు కుటుంబంతో సహా స్వదేశానికి తరలింపు

తెనాలి: రీసెర్చ్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా ఇజ్రాయెల్‌లో శాండ్‌విచ్ డాక్టోరల్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన తెనాలి విద్యార్థి మేకా శరత్‌కుమార్‌కు మరో మూడేళ్లు పరిశోధనను కొనసాగించనున్నారు. ప్రఖ్యాత బార్–ఇలాన్ యూనివర్సిటీలో ఆర్నెల్ల ప్రాజెక్టులో చేసిన కృషికి గుర్తింపుగా తాజా అవకాశం లభించింది. తన గురువు, ప్రపంచంలోని అత్యుత్తమ శాస్త్రవేత్తల్లో ఒకరైన ప్రొఫెసర్ డోరన్ ఔర్బాచ్ నేతృత్వంలోనే ఎనర్జీ స్టోరేజ్ అండ్ కన్వర్షన్ రీసెర్చ్ ఫీల్డ్‌లో «ఎలక్ట్రో కెమికల్ సోడియం అయాన్ బాటరీస్» అనే అంశంపై తన పరిశోధన కొనసాగిస్తారు. శరత్‌కుమార్ స్వస్థలం తెనాలి సమీపంలోని బాపట్ల జిల్లా అమృతలూరు మండలం, మోపర్రు గ్రామ శివారు గోపాయపాలెం. సాధారణ వ్యవసాయ కుటుంబం. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. తల్లి పెంపకంలో వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్శిటీలో బీటెక్ చేశాడు. నిట్, దుర్గాపూర్‌లో ఎంటెక్ చదివాడు. కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థి అయిన శరత్‌కుమార్, ఆ తర్వాత వరంగల్‌లోని నిట్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌లో ఉండగా, 2018లో ఇంపాక్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌కు ఎంపికయ్యారు. పోర్చుగల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ పోర్టోలో పరిశోధన చేశారు. అనంతరం శాపియాంజి యూనివర్శిటీ ఆఫ్ రోమ్ పీహెచ్‌డీ స్కాలర్‌షిప్ లభించింది. యూనివర్శిటీలో ఎలక్ట్రో కెమికల్ ఇంజినీరింగ్‌లో పరిశోధన చేశారు. పీహెచ్‌డీ పరిశోధనలో ఉన్న శరత్‌కుమార్ రీసెర్చ్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం కింద పలు ప్రతిష్టాత్మక ఫెలోషిప్‌లకు ఎంపికవుతున్న క్రమంలోనే గత ఏప్రిల్‌లో ఇజ్రాయెల్ దేశంలోని ప్రపంచ ప్రఖ్యాత బార్–ఇలాన్ యూనివర్సిటీ శాండ్‌విచ్ డాక్టోరల్ స్కాలర్‌సిప్–2023కు ఎంపికయ్యాడు. ప్రొఫెసర్ డోరన్ ఔర్బాచ్ నేతృత్వంలో కెమికల్ ఇంజినీరింగ్‌లో పరిశోధనకు పూనుకున్నారు. రీసెర్చ్ ప్రాజెక్టులో శరత్‌కుమార్ ప్రతిభ, చురుకుదనానికి అబ్బురపడిన గురువు సూచనపై మరో 3–4 ఏళ్ల నూతన ప్రాజెక్టుకు ఎంపికచేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇదే విషయాన్ని శనివారం ఫోనులో «సాక్షి»కి వెల్లడిస్తూ సంతోషాన్ని వ్యక్తంచేశారు. యూనివర్శిటీ క్యాంపస్‌లో ఉంటున్న శరత్‌కుమార్ దంపతులకు గత నెలలోనే బాబు కలిగాడు. మళ్లీ ఇప్పుడు పరిశోధన కాంట్రాక్ట్ లభించింది. ఇలాంటి సంతోషకర సమయంలో ఇజ్రాయెల్‌లో యుద్ధమేఘాలు ఆవరించటం ఆందోళన కలిగిస్తోందని శరత్‌కుమార్ చెప్పారు. అప్పుడప్పుడు బాంబు దాడులు వినవస్తున్నా, టెల్ అవీవ్ దగ్గర్లోని రమాత్‌గాన్ పట్టణంలో గల యూనివర్శిటీ పరిసరాల్లో ప్రజాజీవనానికి ప్రస్తుతం వరకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. యూనివర్శిటీ, ప్రభుత్వ కార్యాలయాలు బ్రేక్ తీసుకున్నట్టు చెప్పారు. ఇలాంటి తరుణంలో ఇజ్రాయెల్‌లో ఉంటున్న భారతీయులను ప్రభుత్వం స్వదేశానికి తరలిస్తుండటం గొప్ప విషయమన్నారు. తాము కూడా ఆదివారం మధ్యాహ్నం ఇజ్రాయెల్ నుండి భారతీయ విమానంలో స్వదేశానికి వస్తున్నట్టు వివరించారు. యుద్ధం త్వరగా ముగిసి సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్షిస్తున్నామని తెలియజేశారు.


తన గురువు, ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ప్రొఫెసర్ డోరాన్ ఔర్బాచ్‌తో మేకా శరత్‌కుమార్